
కథా నిలయం
శ్రీకాకుళం



# విలేఖరి గోవిందు

"గోల్‌మాల్ పత్రికలో మీ కంపెనీ ప్రకటన కావాలి సార్!" గోవిందు అడిగాడు.

" ఆ పేరే నేనెప్పుడు వినలేదే !" ఆశ్చర్యంగా చూశాడు ఆనందరావు. అతను ఆ కంపెనీలో కీలకమైన పదవిలో ఉన్నాడు.

" ఇదిగోండి పాత సంచిక " అంటూ ఓ మ్యాగజైను తీసిచ్చాడు. గెటప్ చూడ ముచ్చటగా ఉంది.... పేజీలు తక్కువ అయినా మేటరు ఎక్కువలా ఉంది.

" సారీ ! ఈ మధ్యే మా కంపెనీ ప్రకటనలు కొన్ని పేపర్లకిచ్చాం - ప్రస్తుతానికి మా దగ్గర బడ్జెట్ లేదు." శాంతంగా చెప్పాడు ఆనందరావు.

" అలా అంటే ఎలా సార్ ! మీరు యిస్తారన్న నమ్మకంతో ఎన్నో పనులు మానుకుని వచ్చాను. జస్టు ఓ ఐదువేల ప్రకటన యిచ్చినా చాలు. పెద్దది మళ్ళీ స్పెషల్ ఇష్యూకు చూసుకుందాం!" గోవిందు చెప్పాడు.

" కుదరదయ్యా ! బడ్జెట్ లేదు. అసలే ఇయర్ ఎండింగ్-నెక్టుయియర్ చూద్దాం లే!" చెప్పాడు ఆనందరావు.

" ఒక్క సారి ఆలోచించండి- మా చిన్న పత్రికలు బ్రతికేది మీ లాంటి పెద్ద వాళ్ళిచ్చే ప్రకటనల బట్టే ! ఒక రోజులో మాయమయ్యే పేపర్లలో ఎన్నో వేలు - లక్షలు పెట్టి యిస్తూ ఉంటారు - కాని మాది ఒక సంచిక కనీసం ఒకనెల ఉంటుంది సర్కులేషన్‌లో. కాస్త ఆలోచించండి సార్ !" గోవిందు ధీమాగా అడిగాడు.

" బాబూ నన్ను విసిగించవద్దు ..... మళ్ళీ కలు " విసుక్కున్నాడు - "నాకు అవతల బోల్డు పన్లున్నాయి." కొంచెం కరుగ్గా చెప్పాడు.

" థ్యాంక్యూ సార్ - ఒక్క స్మైల్ సార్ - ఒక్క ఫోటో ప్లీజ్ !" రిక్వెస్టు చేశాడు.

" సరే కానివ్వు !" కెమెరా క్లిక్‌చేసి దాన్ని బ్యాగులో పెట్టుకుని బయటపడ్డాడు గోవిందు.

ఓ వారం రోజుల తర్వాత ఓ మ్యాగజైను పోస్టులో అందింది ఆనందరావుకు..... తీసి పక్కన పారేశాడు - తన బిజీలో.

కాని పియ్యే ఆ సాయంత్రం చెప్పింది ఆయనకు

"సార్ ! ఈ మ్యాగజైనులో మీ ఫోటో వచ్చింది సార్-కింద ఏదో రాశారు-" శోభ - అతని పియ్యే.

"ఈజిట్ ! ఏం రాశాడబ్బా !" అంటూ ఆమె చూపించినచోట చదివాడు.

ఆనందరావు మొహం పాలిపోయింది. పళ్ళు పట పట కొరికాడు, ఆ వార్త మళ్ళీ చదివాడు. " కార్మికుల్ని వేధిస్తున్న అక్రమార్కుడు ఆనందరావు అన్న హెడ్డింగుతో అయన ఫోటో వేసి క్రింద మేటరు రాసి ఉంది. కార్మికులతో రాత్రింబగళ్ళు పని చేయించుకుని వాళ్ళకు ఓవర్ టైము యివ్వడం లేదు - వారికి సరియైన వసతులు కల్పించడం లేదు. లేబరు రూల్సును అతిక్రమించి ఆఫీసులో పని చేయిస్తున్నారు. బాలకార్మికులతో కూడ పని చేయిస్తున్నారు - ఆనందరావు ప్రవర్తన పట్ల కార్మికులు విసిగి పోతున్నారు - ఫలానా కంపెనీలో ఏ క్షణంలో నైనా ఇండస్ట్రియల్ అన్‌రెస్టు తలెత్త వచ్చు ' - ఇలా రాసుకుంటూ పోయాడు ఆ పత్రికలో.

తన క్రింది ఆఫీసర్లను పిలచి చివాట్లు పెట్టాడు. తమ కంపెనీ గురించి ఇలా ఆవాకులు, చవాకులు ప్రెస్‌కు ఎలా వెళ్ళిందని? ఎవరన్నా విలేఖరులను పిల్చి సమావేశం ఏర్పాటు చేశారాని అడిగాడు. యూనియన్ లీడర్లు గాని ఏదైనా సమాచారం పట్టుకుని ప్రెస్‌కు ఇచ్చారా - అని బుర్ర బద్దలు కొట్టుకోసాగాడు.

ఆ పత్రికా ఆఫీసుకు ఫోన్ చేశాడు. " ఈ న్యూస్ మీ కెలా వచ్చింది ఎవరు రాశారని..." కాసేపటికి ఆయన ప్రయత్నం ఫలించి గోవిందు అనే పేరు వినపడింది.

వెంటనే తన ఆఫీసర్ని పిల్చి గోవిందును పిల్చుకు రమ్మని పంపించాడు ఓ రెండు గంటల తర్వాత గోవిందు వచ్చాడు.

" బావున్నారా సార్ - పిలిచారట - ప్రకటన యిస్తున్నారా ?" వచ్చి కుర్చీలో కూర్చుంటూ అడిగాడు గోవిందు తాపీగా.

" ఏంటయ్యా ! ఈ రాతలు ఏంటి ? నా ఫోటో ఏంటి?" మ్యాగజైను చూపాడు.

" బాగా వచ్చింది సార్ ఫోటో ! న్యూస్ నేను చూడలేదు - " గోవిందు చెప్పాడు.

" ఆపు నీ నటన ! ఇది రాసింది నువ్వే కదూ !"

" ఏమో సార్ నాకు తెలీదు - రోజూ ఎన్నో వార్తలు రాసి పంపుతూ ఉంటాను ఎన్నో పత్రికలకు. అంత గుర్తుండదు." గోవిందు చెప్పాడు.

" నువ్వు దీనికి ప్రత్యేక విలేఖరివి కదా?"

" ఉండచ్చు సార్ - అంత మాత్రాన ఆ వార్త నేను రాయాలని రూలు లేదు సార్ !"

" నా పరువు తీశావు కదయ్యా ! మా కంపెనీలో అలా జరుగుతున్నదని నీ కెవరు చెప్పారు-"

" సారీ సార్ - ప్రొఫెషనల్ సీక్రెట్ - చెప్పకూడదు." గోవిందు తిరస్కరించాడు.

"సరే ! వెంటనే ఆ వార్తను తిరగరాసి మళ్ళీ వేయించు - నీ కెంత డబ్బు కావాలన్నా యిస్తాను." కాళ్ళ బేరానికి వచ్చాడు ఆనందరావు.

" సారీ సార్ ! డబ్బుతో మనుషుల్ని కొనలేరు - మా జర్నలిస్టులకు నిజాయితీనే ప్రాణం!" గోవిందు లేచాడు కుర్చీలోంచి.

"అరే ! కూర్చోవయ్యా ! కూల్ డ్రింక్సు వస్తాయి-ఎండలో వచ్చావు .... ఇన్ని సంవత్సరాలుగా యింత మంచి పేరుతో కంపెనీ నడిపిస్తూ ఉంటే-ఈరోజు గాలివార్తలు విని నా మీద రాస్తే ఎలా? దాని నిజానిజాలు వెరిఫై చేసుకోనక్కర లేదా?" లబలబ బాధ పడ్డాడు.

" సారీ ! మాది పోలీసు డిపార్టుమెంటు కాదు వెరిఫై చేయడానికి."

"సరే ! ఒక పేపరు ప్రకటన ఇస్తాను విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి - దాన్ని హైలైట్ చెయ్యి." చెప్పాడు.

" చూద్దాం - నాకు పనుంది."

" అన్నట్టు లాస్టు టైము చిన్న ప్రకటన అడిగావు కదూ ! పెద్దదే తీసుకో ఎంత ఖర్చయినా ఫర్వాలేదు." అంటూ చెక్ బుక్ తీసి రాసిచ్చాడుట పది వేలకు.

వారిద్దరి మధ్య కొంత సంభాషణ నడిచింది. ఆనందరావు అతన్ని బుజ్జగించి లాలించి, మర్యాద చాలాచాలా చేశాడు.

కాసేపటికి విజయ గర్వముతో బయటకు వచ్చాడు గోవిందు.

యాడ్సు తీసుకు వస్తే పత్రిక యజమాని తెచ్చిన వాడికి భారీగా కమీషన్ ముట్ట చెబుతాడు. యాడ్సు అతగాడికి రెగ్యులర్ ఇన్‌కమ్ అన్న మాట.

గోవిందు విలేఖరిగా చేయబట్టి ఐదు సంవత్సరాలు దాటుతున్నది. సంచలన వార్తలకు అతని చెయ్యి పెట్టింది పేరు! పైగా ఫ్రీ లాన్సు జర్నలిస్టు కూడ.

ఈ వృత్తిలోకి రాక ముందు చిన్న చితక పన్లు చేసే వాడు - కాని ఎక్కడా సరియైన ఆదరణ - సరిపోయినంత జీతం ఉండేది కాదు. ఇక్కడా జీతం గొప్పగా యిస్తారని కాదు. కొన్ని సౌకర్యాలున్నాయి. విలేఖరులకు సంఘంలో మంచి పేరు ప్రతిష్టలున్నాయి - వారంటే భయభక్తులున్నాయి. ముఖ్యంగా పోలీసులు కూడ కొంచెం వెనకా ముందు ఆలోచిస్తారు. వాళ్ళతో మాట్లాడే టప్పుడు. పైగా 'ఈతం' బాగా వస్తుంది 'జీతం' కంటే !

గోవిందు చదువు మధ్యలోనే ఆగి పోయింది. ఆమాట కొస్తే అతనెప్పుడు సరిగా చదువు కోలేదు. యావరేజి స్టూడెంటు. చిన్నప్పుడు మిత్రుల్ని వెంట వేసుకుని చెట్లెక్కడం

– చెరువు గట్ల మీద ఆడుకోవడం – ఈతలు కొట్టడం .... బిల్లంకోడు ఆడ్డం – దొంగ తనంగా బాదం కాయలు, జామకాయలు తెంపుకోవడం – వగైరా చిలిపి చేష్టలు ఎక్కువ చేస్తూ ఉండే వాడు – స్నేహితుల మధ్య గిల్లి కజ్జాలు పెట్టి ఆనందిస్తూ ఉండేవాడు.

తెలుగు మాష్టార్ని ఆటలు పట్టించడం అతనికి భలే సరదా! ఓ సారి క్లాసులో నిద్ర పోతూంటే ఆయన – ఆయన పిలకని కుర్చీ కేసి కట్టేశాడు. నిద్ర లేచింతర్వాత లేవ బోతే – పిలక పట్టేసింది. ఈ పని చేయగల సమర్థుడు గోవిందు ఒక్కడే అని గ్రహించిన వాడు కావడంతో 'నీకు చదువురాదు పో' అని శపించాడు. దాన్ని అతను సీరియస్సుగా తీసుకోలేదు.

" అయినా ఈ కాలం చదువుకుని ఎవడు బాగుపడుతున్నాడు కనుక? చదువుకున్న వాడికంటే చాకలి వాడే మిన్న !" అని లెక్క పెట్టలేదు.

టెన్తు పబ్లిక్కులో తెలుగు పేపర్లోనే ఫెయిల్ అయ్యాడు. మరో సారి ఆ సమస్య లేకుండా తన ఏర్పాట్లు చేసుకుని – బొటా బొటి మార్కులతో పాసై పోయి – టెన్తు అయి పోయిందనిపించుకున్నాడు మరుసటి సంవత్సరం.

ఆ తర్వాత చదువును అర్థాంతరంగా ఆపివేశాడు. పొలంకు పోయాడు, నానా తిప్పలు పడ్డాడు – పొలాలు ఎండి పోయాయి – గిట్టు బాటు కాలేదు.

మూటలు మోశాడు – హోటల్లో క్లీనరుగా గడిపాడు.


చివరికి ఎవరో సలహా యిస్తే విలేఖరి యింటర్వ్యూకు హాజరయ్యాడు. ఇతని పర్సనాలిటీ – ఇతని చొరవ చూసి ఒకరు ఇతనికి జాబు యిచ్చేశారు. తెలుగు సరిగా రాయడం రాకపోయినా – అక్కడ ఎలాగూ మంచి సబ్ ఎడిటర్లున్నారు కాబట్టి అతనికి పెద్దగా బాధలేదు. ఇతను రాసిన వాటిని వాళ్ళే కరెక్షన్లు చేసుకుంటారు, సంస్కరించి ప్రచురిస్తారు.

కాకపోతే యితను ఎన్నిసార్లయినా – ఎంత దూరమైనా తిరిగి వార్తలు సేకరించగలడు. గుండె ధైర్యమెక్కువ!

ఓసారి ఓ రాజకీయ నాయకుడ్ని చందా అడిగాడు తనకు డబ్బులుబాగా అవసరమై. ఆయన యివ్వలేదు. కొంచెం కఠినంగా వ్యవహరించాడు... అంతే !

మరుసటి రోజు పేపర్లో లోకలులో పెద్ద హెడ్డింగుతో వచ్చింది ఓ వార్త! ' కులం పేరుతో దూషిస్తున్న రాజకీయ నాయకుడు' అని. ఇలా విలేఖరుల సమావేశంలో ఒక కులం వాళ్ళని చాలా హీనంగా మాట్లాడాడని... అతని అహంకారం ఎంత దూరం పోయిందంటే ముఖ్యమంత్రిని కూడ దూషించాడని... అతనికి నోరు జాస్తి అని – అంతకు ముందు కూడ చాలా సందర్భాలలో నోరు పారేసుకున్నాడని రాసేశాడు గోవిందు.

ఆ రాజకీయ నాయకుడు ఆ వార్త చదువుకునే లోగానే ముఖ్యమంత్రి నుండి తీవ్ర


ఆ ఏడు కొండలూ వెంకన్నవే!! ముందు ఆ దేవుడికే ఇద్దాం! తర్వాత తలా ఒకటే పంచుకుందాం!!
ఏవిఎమ్.
అవినీతిపై ఐదేళ్ళ లోపు పిల్లలు ఉద్యమించాలి!!
ఏవిఎమ్.
ప్రతిపక్షాలను మరీ అలాగా తిట్టకండి! రేపు మళ్ళీ, ఆపార్టీలో చేరుతా నన్నారుగా!
ఏవిఎమ్.

పదజాలంతో విమర్శ వచ్చింది. ఆ న్యూస్ చదివిన అతని అభిమానులు – స్నేహితులు ఎన్నో ఫోన్లు చేశారు. అతగాడు తల కాయ పట్టుకుని గోవిందును పిల్చి క్షమాపణ చెప్పుకుని అతను అడిగిన దానికంటే రెట్టింపు చందా యిచ్చి మరుసటి రోజు పేపరులో ఖండన వేయించాడు. కాని ఖండన ఎవరు చూస్తారు కనుక – అతనికి జరగాల్సిన అపకారం జరిగి పోయింది – మంత్రి పదవి వరిస్తుందనుకుంటే చిన్న కమీషన్‌లో పదవి కూడ యివ్వలేదు ముఖ్యమంత్రి. అప్పటి నుండి ఆ రాజకీయ నాయకుడు విలేఖరులతో భయభక్తులతో మెలగుతూ ఉంటాడు.

గోవిందు ఒక్కోసారి ప్రాణాలకు తెగించి కూడ వార్తలు సేకరిస్తూ ఉంటాడు. ఒకసారి మత ఘర్షణ జరుగుతున్న ప్రాంతానికి పోయి ఫోటోలు తీశాడు... ఒక వర్గం వాళ్ళు యితన్ని కత్తితో పొడవబోతే ఒడుపుగా తప్పించుకుని పారిపోయి వచ్చాడు. ఆ ఫోటోలను ప్రముఖ జాతీయ పత్రికలకు పంపాడు... మంచి పేరు వచ్చింది కూడ.

గోవిందుకు పెళ్ళయింది.... ఇద్దరు పిల్లలున్నారు కూడ.

అతని భార్య సుజాత రోజూ పోరుతున్నది గోపాలంను స్కూల్లో చేర్పించాలని – అల్లరి ఎక్కువయిందని. కాని అతనికి టైం దొరకడం లేదు ఇంటి విషయాలు పట్టించుకోవడానికి. రోజూ బిజీగా ఉంటున్నాడు. కాని ఆ రోజు వార్తలు దొరక లేదు. ఇంతలో భార్య మాటలు గుర్తుకు వచ్చి పెద్దోడు గోపాలంను కిండర్ గార్డెన్ లో చేర్పిద్దామని ఆ ఊళ్ళోని ప్రముఖ స్కూలుకు వచ్చాడు. కరెస్పాండెంటు అంకారావును కలిశాడు.

" సార్ ! మా వాడికి మీ స్కూల్లో సీటు కావాలి సార్ !" చెప్పాడు.

" కుదరదయ్యా ! దానికి చాలా ప్రొసీజరుంది – ఎంట్రెన్సు టెస్టు పెడతాం – దాంలో పాసు కావాలి !" అంకారావు చెప్పాడు.

" అరే ! బుడ్డోడు, వాడికి ఎమ్‌సెట్ ఎంట్రెన్సు లాగా టెస్టు ఏంటి సార్!" ఆశ్చర్య పోయాడు.

" వాడికి కాదయ్యా ! మీకు – మీభార్యకు – మీ యిద్దరు ఎగ్జామ్ రాయాలి. దాంలో పాసయితే – పది హేను వేలు డొనేషను కట్టాలి! అప్పుడు కాని సీటు రాదు."

" సార్ ! ఏదో బీద జర్నలిస్టును – మా కొచ్చేదే రెండు వేలు – మా లాంటి వాళ్ళు అన్ని వేల డొనేషన్లు ఎలా కడతారు సార్ జీరో క్లాసులకు?"

" రూలంటే రూలయ్యా – ఇవన్నీ మాకేం రావు. బిల్డింగు ఫండు – మీరిచ్చే దబ్బులతో క్లాసు రూములు కడతాం – " త్యాగం చేస్తున్నట్లు చెప్పాడు అంకారావు.

" ఆ బిల్డింగ్సు జాతికి అంకితం చేస్తారా సార్?" గోవిందు అడిగాడు.

" నో ! నో ! పిల్లకాయల పాఠాలకు ఉపయోగపడతాయి– మరి వాళ్లకు వసతులు

ఏర్పాటు చెయ్యాలి గదా !"

"సరే సార్ ! మీ తిప్పలు మీవి - కాని మాలాంటి బీదోళ్ళను కూడ కాస్త కనికరిస్తూ ఉండండి... మీ స్కూల్లో చేర్పించాలని నాకు చాలా కోరికగా ఉంది."

" ఇది ధర్మ సత్రం కాదు. బీదోడివైతే ఇంకో స్కూల్లో చేర్పించుకో - అక్కడ కూడ డొనేషన్లు కట్టలేక పోతే వీధి బడులుంటాయిగా - దాంలో చేర్పించుకో - అంతే గాని యిలా నా టైం వేస్టు చేయొద్దు..." అంటూ కేకలేశాడు అంకారావు.

గోవిందు నిరాశగా బయటకొచ్చాడు. ఆసమయానికి అక్కడ కామన్ ఎగ్జామ్స్ జరుగుతున్నాయి ఆ స్కూల్లో .

ఓ గంట ఆస్కూలు దగ్గర ఉండి గమనించాడు - కొన్ని ఫోటోలు తీసుకున్నాడు... మరునాడు పేపర్లో ఆ స్కూలు గురించి సంచలన వార్తలు వచ్చాయి.

కాఫీ కొట్టిస్తున్న కరెస్పాండెంటు-

జలగలాగా తల్లి దండ్రులను పీడిస్తున్న కరెస్పాండెంటు -

టీచర్లను చిత్రహింసల పాలు చేస్తున్న ఓ ప్రముఖ స్కూలు - అంటూ నాలుగయిదు రకాలుగా ఆస్కూలుమీద పెద్ద ఆర్టికల్ ఓ ప్రముఖ జాతీయ దిన పత్రికలో ప్రచురించ బడింది.

నెత్తి నోరు కొట్టుకుంటూ అంకారావు ఉరుక్కుంటూ ఆ పత్రికాఫీసుకు వచ్చాడు.

" ఏంటయ్యా నా గురించి యింత చెత్తగా రాస్తున్నారు - ఎవడయ్యా యిలా రాసింది-" దాం థూం అంటూ అరవసాగాడు.

ఎడిటర్ బెల్ కొట్టాడు... ప్యూనుకు చెప్పాడు విలేఖరిని రమ్మని. గోవిందు వచ్చాడు.
" నమస్కారం సార్ - బాగున్నారా?" నవ్వుతూ అడిగాడు.

" నాబొంద - బాగుండటమేందయ్యా ? ఏంటయ్యా ఈ రాతలు - నా బతుకు - పరువు బజార్లో పడేశావు ! ఇలా రాస్తే నా స్కూల్లో ఎవరు చేరతారయ్యా ! రాసేప్పుడు కాస్త ఇంగిత జ్ఞానం ఉండక్కరలా ?" అంకారావుకు కొంత రాజకీయ నాయకుల అండ ఉంది - అందుకే రెచ్చి పోతున్నాడు.

" సార్ ! వార్తలు ఎలా రాయాలో మీరు మాకు నేర్పక్కరలేదు - మీ స్టూడెంట్లకు సక్రమంగా పాఠాలు చెప్పించండి చాలు!" గోవిందు చెప్పాడు.

"ఏంటయ్యా ! మాట్లాడితే నా స్కూలును ఎత్తుతావు ? ఏంటి నీ ఉద్దేశ్యం - ఆఫ్టరాల్! కుర్ర సన్నాసివి నాకు నీతులు చెబుతావు!"

" ఏదో వార్తలు రాసుకుని బ్రతికే వాళ్ళం మాకు పెద్దగా చదువురాదు లేండి. చదువొచ్చిన తమరేం చేస్తున్నారు - దగ్గరుండి పరీక్షల్లో కాపీలు కొట్టిస్తున్నారు - కొందరికి

ఆన్సర్లు చెప్పి రాయిస్తున్నారు - " గోవిందు ఎగతాళి చేశాడు.

" ఎడిటర్ సారూ ! మీ పేపరుకు లక్షలు పెట్టి ప్రకటనలు యిస్తూ ఉంటాను - ఇందుకేనా - నన్ను - నాస్కూలును బదనామ్ చేయడానికేనా ! వీడెవడో వార్తలు రాస్తే - మీరన్నా దాన్ని చదివి ఆపకూడదా ?" ఎడిటర్ మీద లేచాడు కోపంగా.

" మాకు పత్రికా స్వాతంత్ర్యం ఉంది. మా దృష్టి కొచ్చిన అక్రమాలను ప్రజలకు తెలియ చెయ్యడమే మా ఆశయం!" ఎడిటర్ చెప్పాడు.

" కాని 'తనమన' ఉండాలిగా వార్తలు రాసేప్పుడు - వెంటనే రేపు క్షమాపణలతో మా స్కూలు మీద సరిగా రాసి వెయ్యి!" ఆజ్ఞాపించాడు.

" మీరు ప్రకటన రూపంలో యివ్వండి - వేస్తాం!" ఎడిటర్ చెప్పాడు.

" అలా కాదయ్యా ! వార్త కథనంలాగా వేయండి - " అంకారావు చెప్పాడు.

" కుదరదు - " గోవిందు చెప్పాడు

అంకారావు ఆవేశం వచ్చి పేపర్ వెయిట్ తీసి నేల కేసి కొట్టాడు... గోవిందు ఫోటో తీశాడు - అంకారావు అతని మీద కలయబడ పోయాడు. గోవిందు అది కూడ ఫోటో తీశాడు - ఎడిటర్ అతన్ని శాంతింప చేశాడు.

" చూడయ్యా ! ఎడిటర్ ! కుర్రాళ్ళు ఏదో రాస్తూ ఉంటారు-పెద్దోడివి నువ్వు చూసుకోవాలి-లేకపోతే గొడవైపోతుంది... రేపు పేపర్లో నాస్కూలు గురించి మంచిగా రాయకపోతే ఏం చేస్తానో చూడు-" ఆవేశంగా చెప్పాడు అంకారావు అతనికి బీపి కొంచెం ఎక్కువ.

" ఏం చేస్తారు? " గోవిందు అడిగాడు నవ్వుతూ   అది ఇంకొంచెం రెచ్చ గొట్టింది అంకారావును.

" ఏం చేస్తానా-మినిష్టరుగారితో చెప్పి మీపేపరు ఎలా నడుస్తుందో చూస్తాను. జాగ్రత్త!"

" మంచిది సార్ - " ఎడిటర్ మర్యాద పూర్వకంగా సాగనంపాడు.

కాని మరునాడు పేపర్లో 'పత్రికాఫీసుపై దాడి చేసిన కరెస్పాండెంటు' అంటూ మళ్ళీ ప్రముఖంగా వార్తలు వచ్చాయి. దానికి తోడు ఫోటోలు ఆఫీసుగది అంతా చెల్లా చెదురైనట్లు రకరకాల ఫోటోలతో ఆ ప్రముఖ దిన పత్రికలో వచ్చింది.

అంకారావుకు బాగా కోపం వచ్చి మినిష్టరును కలిసి అంతా వివరించాడు... ఎట్లాగయినా వాళ్ళ పైన చర్య తీసుకోమని కోరాడు. అవసరమైతే అసెంబ్లీలో కూడ ప్రస్తావించమన్నాడు - అంతా విని మినిష్టరు గారు శాంతంగా చెప్పాడు.

" అంకారావు నువ్వు ఎదగాలయ్యా ! పట్టు విడుపులుండాలి! ఎవరితో నన్నా పెట్టుకో

గాని - విలేఖరులతోటి - పత్రికలతోటి పెట్టుకోమాకు. కొరివితో తల గోక్కుంటే ఏమవుతుంది - జుత్తు కాలి పోతుంది. జరిగింది మర్చిపో - వాళ్లతో రాజీ పడు."

" ఏంటి సార్ ! ఇంత పవరు ఉండి యిలా బీద అరుపులు అరుస్తారు మీకు చేతకాక పోతే చెప్పండి - నేను నా వాళ్ళతో చెప్పి వాడ్ని లేపేస్తాను - అది నాకేం కొత్తకాదు - " అంకారావు ఆవేశ పడ్డాడు.

"అందుకే నీకు బుర్ర లేదండి.. మైనారిటీలతోటి - జర్నలిస్టులతోటి పెట్టుకుంటే మనకే నష్టమయ్యా ! గోవిందును లేపేసినంత మాత్రాన నీ సమస్య తెగదు ప్రెస్సు అంతా ఒకటే! అందరూ ఏకమై మీ పైన దాడి చేస్తారు. చివరికి దెబ్బతినేది నువ్వే! న్యాయస్థానాలు కూడ వారికి కొన్ని హక్కులిచ్చాయి. పత్రికలతో పెట్టుకుంటే చరిత్రలో ఉండవు." అంటూ చాలాసేపు సుద్దులు చెప్పాడు.

అంకారావు బుసలు కొట్టాడు, అయినా బుజ్జగించాడు.

" మంత్రి అయి ఉండి కూడ - వాళ్ళను ఏం చెయ్యలేక పోవడం దారుణం!"

" నిన్ను రక్షించాలని నేను పూనుకుంటే నా పదవికే ముప్పు వస్తుందయ్యా! సర్పయాగం నుండి తప్పించుకుందామని తక్షకుడు మహేంద్రుడ్ని ఆశ్రయిస్తే ఏమైంది? బాపనోళ్ళు 'సమహేంద్రాయ తక్షకాయ స్వాహా!' అని మంత్రం చదవగానే ... మహేంద్రుడి సింహాసనానికి చుట్టుకున్న తక్షకుడు - ఆ సింహాసనం -ఆ సింహాసనం మీద కూర్చున్న మహేంద్రుడు - అందరూ కదిలారు గదా అగ్నికి ఆహుతి కావడానికి - అప్పుడేం చేశాడు మహేంద్రుడు - సీటు వదిలి పారిపోయాడు - కాబట్టి కొన్ని కండబలంతో కంటే ... బుర్రతో జయించాలి!" అంటూ కొన్ని సూచనలు యిచ్చి పంపించాడు.

రెండు రోజుల తర్వాత అంకారావు కారు వేసుకుని గోవిందు యిల్లు వెతుక్కుంటూ వచ్చాడు... ఆ సమయంలో గోవిందు లేడు - అతని భార్య సుజాత ఉంది... ఆమె దగ్గరికి పోయి భోరున ఏడ్చాడు - జరిగింది చెప్పాడు.

సుజాత ఏమీ మాట్లాడలేదు.

ప్యాకెట్టులోంచి పట్టు చీర తీసి ఆమెకిచ్చాడు - సుజాత తిరస్కరించబోయింది.

" ఉంచమ్మా చెల్లెమ్మా - పండుగకు ఈ అన్నయ్య యిస్తున్న చిన్న చిరుకానుక !" బలవంతంగా ఆమె భుజాలకు కప్పాడు.

అప్పుడే గోవిందు యింటికి వచ్చాడు...

" ఓ చాలా గొప్ప వ్యక్తి - రాజకీయ దురంధరులు - కోటీశ్వరులు - విద్యావేత్త - మా యింటికి వచ్చారేం సార్ - దారి తప్పారా?" గోవిందు వ్యంగంగా అడిగాడు.

" బాబ్బాబు ! అలా అనకు - ఎంతయినా మనందరం ఒకటి! నీ పిల్లాడికే కాదు -

యింకెవరికైనా సీటు యిస్తాను – నాస్కూల్లో – ” చేతులు పట్టుకున్నాడు.

“ వద్దులేండి సారూ – మా పిల్లాడి మూలంగా మీస్కూలుకు చెడ్డపేరు వస్తుంది – మా వాడు చాలా డల్లు !” తిరస్కరించాడు దూరంగా జరుగుతూ. “ మీ పరీక్షలో మేము ఎలాగూ ఫెయిల్ అవుతాం.”

“ గోవిందు – తప్పయి పోయింది క్షమించు – ఇవి చేతులు కావు – కాళ్ళనుకో – మీ పిల్లాడ్ని మా స్కూల్లో చేర్పించు .” అంకారావు చెప్పాడు.


“ వద్దులేండి సార్ – మేం అంత డొనేషన్లు కట్టలేం – ఏదో వీధి బడిలో చేర్పించుకుంటాను” గోవిందు చెప్పాడు.


“ బాబ్బాబు – అంత మాట అనకు – నిన్ను డొనేషను ఎవరడిగారయ్యా! ఫీజులు కూడ కట్టక్కరలేదు బాబు చదివినంతకాలం ఉచితంగా మా స్కూల్లో చదువుకోవచ్చు – మీ అబ్బాయి మా స్కూల్లో చదవడమే మాకు గొప్ప పేరు తెస్తుందయ్యా!” అంటూ స్వీట్లు – బట్టలు పెట్టి అతన్ని ప్రాధేయ పడ్డాడు.


గోవిందుతో బలవంతాన ఓకే అనిపించుకుని వెళ్లి పోయాడు.


విలేఖరి గోవిందు ప్రయోజకత్వం చూసి సుజాత మురిసి పోయింది.

– ఆకాశవాణి సౌజన్యంతో




అమ్మాయి! మావయ్య వాళ్ళింటికి
నన్ను బస్సులో పంపిస్తే రెండొందలు!
ఇలా పంపిస్తే యాభై ఖర్చు!!
పార్శిలు
ఏవిఎమ్.
నేను రాజకీయాల్లోకి వచ్చినంతర్వాత
నేను సంపాయించింది
'బి.పి'
మాత్రమే!
ఏవిఎమ్.
అంటే వీరి ఆస్తులు
బొంబాయి, పూనాల్లో
వున్నాయన్నమాట!!
వాడు దొరకడండీ! వాడు నడిపే
స్మగ్లర్ హోటళ్ళు అన్నీ
నాకు తెలుసు!!
మంత్రి
ఏవిఎమ్.


తమిళనాడులో! వాస్తు దోషం వల్ల రెండు రైళ్ళు గుద్దుకున్నాయి!!
ఏవిఎమ్.


నాయకుడిని కలవాలంటే జైలుకు వెళ్ళండి
ఏవిఎమ్.